సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 28 । జూన్ । 2025



వందనానికి వంకలా!

కూటమి ప్రభుత్వం తమ పిల్లలకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయకపోవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


8లో



రోడ్డు ప్రమాదంలో ర్యాలి వాసి మృతి

అనకాపల్లి జిల్లా కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్, మహిళ దుర్మరణం పాలయ్యారు.

డెల్టాలకు 10,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

పంట కాలువల ఆక్రమణల తొలగింపునకు చర్యలు

జల వనరులశాఖ ఇంజినీర్లకు జేసీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: జిల్లాలో పంట కాలువల వెంబడి ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగింపునకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జేసీ టి.నిశాంతి జలవనరుల శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, జలవనరులశాఖ ఇంజనీర్లు, మూడు రెవెన్యూ డివిజన్ల అధికారులతో ఆమె సమీక్షించారు. జల వనరులశాఖ పరిధిలో ఉన్న ఆక్రమణల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సత్వరం వాటిని తొలగించాలని సూచించారు. ఆర్డీవోలు జలవనరుల శాఖ ఇంజినీర్ల సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజకుమారి కె.మాధవి, పి.శ్రీకర్, బి.అఖిల, జలవనరుల శాఖ ఇంజినీర్లు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరం ఘటన మృతులకు నివాళి



మృతుల చిత్రపటాల ఫ్లెక్సీకి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: గెయిల్ హామీల అమలుకు అవసరమైతే పోరాడేందుకు సిద్ధమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. నగరం గ్రామంలో గెయిల్ విస్ఫోటం జరిగి 11 ఏళ్లు అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నాటి ఘటనలోని మృతుల చిత్రపటాలతో ఉన్న ఫ్లెక్సీ వద్ద వారికి నివాళులర్పించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. అప్పట్లో ఇచ్చిన హామీల్లో 11 హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. వాటిని సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని, దీనిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని, అవసరమైతే బాధితుల తరపున పోరాడతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 4న జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ-కాకినాడ 11వ స్నాతకోత్సవం వచ్చే నెల 4న నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా వర్సిటీ చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని, ముఖ్య అతిథి బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రమ్మణ్యానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామని వివరించారు. స్నాతకోత్సవంలో భాగంగా 2023-24కు సంబంధించి బీటెక్ 41,258, బీ-ఫార్మసీ 2,081, ఎంటెక్ 1,659, ఎంబీఏ 3,797, ఎంసీఏ 1,115, ఫార్మా-డి 274, బీఆర్క్ 83, పీహెచ్‌డీ 100, బంగారు పతకాలు 40 ప్రకటించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు మాజీ వీసీలు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవార్లకు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితుడు ఉపాధ్యాయుల రమేష్, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకులు బాలు, వేణు, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. ఈ హోమంలో 20 మంది భక్తులు రూ.750 టికెట్టుతో పాల్గొన్నారు. కాగా, సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, రత్నగిరి దిగువన తొలి పావంచా వద్ద కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యాన పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు.



పెదపళ్లలో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



చింతలూరులో బెంగాలీ కూలీల ఆకుతీత పనులు

సాగు.. బెంగ తీరేలా..!

- బెంగాలీ కూలీల వైపు రైతుల చూపు
- అక్కడి పద్ధతిలో చురుగ్గా నాట్లు
- సమయం..పెట్టుబడి ఆదా
- అధిక దిగుబడులకూ అవకాశం

ఆలమూరు: పొరుగు రాష్ట్రం కార్మికులు లేనిదే మన రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో వరి సాగయ్యే అవకాశం లేదు. ఇప్పటికే సాగులో ఆధునిక యంత్రాలతో పాటు వరినాట్లు వేసే డ్రమ్ము సీడర్ యంత్రం అందుబాటులోకి వచ్చినా కూలీల కొరత మాత్రం తగ్గడం లేదు. ఖరీఫ్, రబీ సీజన్లలో వరినాట్లు వేసేందుకు కూలీల అవసరం ఎక్కువగా ఉంటుంది. వారి కొరతను ఎదుర్కొనేందుకు వలస కూలీలపై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో పశ్చిమ బంగాల్‌లో అమలవుతున్న వరిసాగు పద్ధతులు స్థానిక రైతులను ఆకర్షిస్తున్నాయి. అక్కడి విధానాలతో అధిక దిగుబడుల సాధనతో పాటు కూలీల కొరతను ఇక్కడి రైతులు అధిగమిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే వారు స్థానిక రైతులకు వరమనే చెప్పాలి. గతంలో వరినాట్లు సమయంలో ఆకుతీతకు మగవారిని, వరినాట్లకు ఆడ కూలీలను వినియోగించుకునే వారు. అయితే బెంగాలీ కూలీల రాకతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. గత పదేళ్ల నుంచి బెంగాలీ కూలీలు చక్కని నేర్పరితనంతో సమయాన్ని, పెట్టుబడిని ఆదా చేస్తూ ఆకుతీత నుంచి వరినాట్ల వరకూ పనులు చేస్తుండటంతో ఏటా వారి విధానాలకు ఆకర్షితులయ్యే రైతుల సంఖ్య పెరుగుతుంది.



పినపళ్లలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్న బెంగాలీ కూలీలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1.64 లక్షల ఎకరాల్లో వరిసాగవుతోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1.06 లక్షల మంది రైతులు సాగులో నిమగ్నమయ్యారు. ధవళేశ్వరం వద్ద తూర్పు, మధ్య డెల్టాకు సాగునీటిను విడుదల చేయడంతో పాటు వర్షాలు కురుస్తున్నందున ఆకుతీత, వరినాట్లు సీజన్ చురుగ్గా సాగుతోంది.

బెంగాలీ విధానంలో నాట్లు

వరినాట్లు వేసే సమయంలో బెంగాలీ కూలీలు స్థానిక కూలీలకు భిన్నమైన శైలిని అవలంబిస్తారు. ఈ కార్మికులు రోజంతా పనిచేయకుండా కేవలం తెల్లవారుజామున పనులు ప్రారంభించి వాయు వేగంతో పనిచేసి మధ్యాహ్నానికే పని ముగించుకుంటారు. అప్పటి నుంచి సాయంకాలం వరకూ విశ్రాంతి తీసుకుని రాత్రికి స్వయంగా నచ్చిన వంటకాలు చేసుకుని హాయిగా జీవనం సాగిస్తుంటారు. వారి పద్ధతిలో వరినాట్లు సులభతరం కావడంతో ఏటా పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే కూలీల సంఖ్య పెరుగుతుంది. దీంతో జిల్లాలో ప్రస్తుతం సుమారు 70 శాతం మేర నారుమడులకు వారినే వినియోగిస్తున్నారు. వారి విధానంలో వేసే నాట్ల వల్ల పంటకు తెగుళ్ల బెడద తగ్గడంతో పెట్టుబడులు కూడా ఆదా అవుతుండటంతో రైతులు వారి పని విధానంపైనే ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు వచ్చే బెంగాలీ కూలీలకు స్థానిక రైతులు స్థావరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక వసతులు సమకూరుస్తున్నారు.

పెట్టుబడి ఆదా

స్థానిక వ్యవసాయ కూలీల కన్నా భిన్నంగా బెంగాలీలు వరినాట్లు వేగంగా వేయడంతో పాటు సమదూరంలో వరినాట్లు వేయడం వల్ల వరి నారు ఆదా అవుతుంది. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు ఆశాజనకమైన దిగుబడులు రావడంతో రైతులు వారిపై మక్కువ చూపుతున్నారు. వరిసాగులో తక్కువ నారును ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలన్న ప్రచారానికి తగ్గట్టుగా బెంగాలీలు నాట్లు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వరిసాగులో గతంలో రైతులు ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి 15 నుంచి 20 కిలోల విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. స్థానిక కూలీలు 30 రోజుల వయసు గల నారును మాత్రమే వినియోగిస్తారు. స్థానిక కూలీలు వేసిన నాట్లు మూనలుగా తిరిగేందుకు సుమారు పది రోజులు పడుతుంటే బెంగాలీ కూలీలు వేసే నాట్లు నాలుగు రోజుల తరువాత మూనలు కడుతున్నాయి. స్థానిక కూలీలు ఎకరాకు సుమారు 45 పోగులకు పైగా వినియోగిస్తుంటే అదే విస్తీర్ణానికి బెంగాలీలు కేవలం 15 నుంచి 20 పోగులు వాడుతున్నారు.

ఎకరాకు నలుగురు కూలీలే..

ఎకరా పొలానికి వరినాట్లు వేసేందుకు సాధారణంగా ఆరుగురు కూలీలు అవసరం కాగా బెంగాలీ విధానంలో నలుగురు మాత్రమే ఉండి అనుకున్న గడువు మేరకు పని పూర్తి చేసుకుని వెళుతున్నారు. అలాగే వారి వద్ద ఉన్న ప్రత్యేక పరికరం ద్వారా తాము చేసిన పనిని సెంట్లతో సహా కొలతలు చేసి కచ్చితంగా కొలుచుకుంటారు. అలాగే ఒప్పందానికి అనుగుణంగా కూలీ సొమ్మును తీసుకుంటారు. దిగుబడుల్లో సైతం భారీ వ్యత్యాసం కనపడుతుండడంతో స్థానిక రైతుల పంట పండినట్లు అవుతోంది. సాధారణంగా స్థానిక కూలీల చేత పూర్తి చేసిన ఆకుమడులు అందుబాటులోకి వచ్చాక ఆకుతీత, వరినాట్లు వేసేందుకు ఎకరాకు రూ.పది వేలు ఖర్చవుతుంది. అయితే బెంగాలీ కూలీలు మాత్రం ఎకరాకు రూ.నాలుగు వేలు మాత్రమే తీసుకుంటున్నారు. బెంగాలీ కూలీల చేత చేయించుకున్న పనుల వల్ల ఎకరానికి ఐదు బస్తాల వరకూ దిగుబడులు అదనంగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. వరిసాగు ఖర్చు సుమారు రూ.ఆరు వేల వరకు తగ్గుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ సూచనలు తప్పనిసరి



వరిసాగులో వ్యవసాయశాఖ సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలి. గతంలో రైతులు కేవలం వరినాటు పద్ధతిని మాత్రమే అవలంబించేవారు. ప్రసుత్తం వ్యవసాయంలో వచ్చిన మార్పుల వల్ల వెదజల్లు విధానంలోను రైతులు అధికంగా సాగు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం స్థానికంగా కూలీల కొరతను ఎదుర్కొనేందుకు బెంగాలీ కూలీలను వినియోగించుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం.

– కె.నాగేశ్వరరావు, డివిజనల్ వ్యవసాయాధికారి, ఆలమూరు

బెంగాలీ కూలీలతో నాట్లు వేగవంతం



వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ పనులు త్వరగా ప్రారంభించాం. కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నాను. బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయించడానికే ప్రాధాన్యమిస్తున్నాం. వారు ఊడ్పు యంత్రం తరహాలో నాట్లు వేశారు. దీనివల్ల ఖర్చు తగ్గింది. చీడపీడల బెడద తగ్గింది. ఎకరానికి ఐదు బస్తాల ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాను.

– కొత్తూరు సాయి రామకృష్ణ, రైతు, పినపళ్ల

22ఎ భూముల జాబితా పబ్లిష్ చేయాలి

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: 22ఎ భూముల విషయంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వానికి ఓ సూచన చేశారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన చర్చలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఆఖరికి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే వ్యక్తి కూడా రైతుల భూములు 22ఏలో పెట్టేలా పరిస్థితులు ఉన్నాయన్నారు. దీనివల్ల చాలా మంది రైతులు సమస్యలు ఎదుర్కొంటూ ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలంటే గ్రామ స్థాయిలో 22 ఏ భూముల జాబితాను పబ్లిష్ చేయాలని ఆయన సూచించారు.

ఆ సొమ్ము ఏ మూలకు?

- హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధికి గతంలోనే రూ.400 కోట్లతో అంచనాలు
- ఇప్పుడు కేవలం రూ.94 కోట్లు తెచ్చి హడావుడా?
- అందులోనూ జీఎస్‌టీ పోనూ మిగిలేది రూ.77 కోట్లే
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వాటికి ప్రారంభోత్సవాలు చేస్తూ కూటమి నాయకులు నానా హంగామా చేస్తున్నారని మాజీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మారినా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగడం సహజమని, అయితే ఎవరు కృషి చేశారో కూడా గుర్తించాలని అన్నారు. 'దాదాపు 2.3 కిలోమీటర్ల పొడవైన హేవలాక్ వంతెన అభివృద్ధికి కనీసం రూ.400 కోట్లు ఖర్చవుతుందని గతంలోనే అంచనా వేయించాం. అటువంటిది ఇప్పుడు కేవలం రూ.94 కోట్లు తెచ్చి హేవలాక్ వంతెనకు రోడ్డు వేస్తామని, ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని కూటమి నాయకులు చెప్పడం వింతగా ఉంది. ఇందులో 18 శాతం జీఎస్‌టీ పోనూ రూ.77 కోట్ల వరకూ మాత్రమే మిగులుతుంది. ఈ డబ్బు ఏ మూలకు సరిపోతుంది?' అని భరత్‌రామ్ ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి ఐఎల్‌టీడీ జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ ప్రతిపాదించినప్పుడు, రైల్వే స్థలం కూడా పోతున్నందున ప్రత్యామ్నాయంగా వీఎల్ పురంలోనే స్థలం ఇచ్చామని చెప్పారు. అఖండ గోదావరి ప్రాజెక్ట్ కోసం కూటమి నాయకులు చెప్పే కార్యక్రమాలన్నీ చేయాలంటే రూ.700 కోట్లు అవుతుందని తెలిపారు. రివర్ ఫ్రంట్‌కు రూ.22 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.8 కోట్లకు కుదించడం వింతగా ఉందని విమర్శించారు. 'గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.125 కోట్ల స్పెషల్ గ్రాంటు ఇచ్చారు. ఆ నిధులతో హ్యాపీ స్ట్రీట్, గోదావరి స్టేషన్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద పుష్కర్ ప్లాజా, సుబ్రహ్మణ్య మైదానంలో ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్ నిర్మాణాలతో పాటు కంబాల చెరువు సుందరీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశాం' అని భరత్ గుర్తు చేశారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడితే చర్యలు

కలెక్టర్ మహేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: షెడ్యూల్ కులాలు, తెగల వారిపై అన్యాయంగా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 2025 రెండో త్రైమాసానికి సంబంధించి ఆయన అధ్యక్షతన కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి పౌర హక్కుల రక్షణ ఎస్సీ ఎస్టీ దురాగతాల నివారణ చట్టం అమలుపై ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులు సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. సత్వర విచారణకు అవసరమైన ధ్రువ పత్రాలు ఎప్పటికప్పుడు జారీ చేయాలన్నారు. ఆయా వర్గాల హక్కులు, రక్షణ కోసం ఏర్పాటైన చట్టాల పటిష్ట అమలుకు పోలీస్, న్యాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గత సమావేశపు తీర్మానాలపై తీసుకున్న చర్యలను సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి. జ్యోతిలక్ష్మీదేవి వివరించారు. బాధితులకు పరిహారం, ఉపాధి కల్పన విషయంలో జాప్యం జరగకుండా పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 66 కేసులు నమోదు కాగా, 47 ప్రాథమిక విచారణ దశలో, 20 కేసులు చార్జిషీట్ దశలో ఉన్నాయన్నారు బాధితులకు రూ.41.25 లక్షల పరిహారం చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే బాధితులకు అందజేస్తామని ఆయన తెలిపారు. లక్షిత వర్గాల సంక్షేమానికి వసతి గృహాలలో గెయిల్ సీఎస్సార్ నిధులతో కిచెన్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ టి.నిశాంతి, డీఆర్‌ఓ రాజకుమారి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు ప్రసాద్ , మురళీమోహన్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను సారా రహితం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

కాకినాడ సిటీ: జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమ నిర్వహణకు అధికారులు కృషి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సారా నిర్మూలనకు అధికారులు, సిబ్బంది ఇప్పటి వరకూ చేసిన కృషిపై సమీక్షించారు. సారా ముద్దాయిలను బైండోవర్ చేయాలని, సారా తయారీకి బెల్లం సరఫరా చేసే వ్యాపారులపై గట్టి నిఘా ఉంచాలని, వారిని కూడా బైండోవర్ చేయాలని ఆదేశించారు. సారా నిర్మూలనపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. పలు కేసులలో ముద్దాయిల ప్రవర్తన పరిశీలించి, ఇంకా సారా వ్యాపారం చేస్తుంటే పీడీ యాక్ట్ పెట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏనుగుల చైతన్య మురళి, అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎం.కృష్ణకుమారి, ఏఈఎస్ కె.మౌనిక, జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

శుభకార్యాలకు శూన్యం!

- ఆషాఢానికి ఎన్నో ప్రత్యేకతలు
- వర్షాలతో సాగు పనులకు శ్రీకారం
- వైష్ణవ ఆరాధనలకు ప్రాశస్త్యం

కొత్తపేట: తెలుగు మాసాల్లో ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ప్రస్తుతం నడుస్తున్నది ఆషాడం. హిందూ పురాణాల ప్రకారం ఈ మాసానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. పాటించాల్సిన నియమాలు ఎన్నో ఉన్నాయి. గురువారం నుంచి ప్రారంభమై వచ్చే నెల 24తో ఈ నెల ముగుస్తుంది. ఈ మాసాన్ని శూన్యమాసం అంటారు. వివాహాది శుభకార్యాలు ఏమీ ఈ నెలలో తలపెట్టరు. ఈ మాసంలో అనేక పర్వదినాలున్నాయి. ఆషాడ శుద్ధ ఏకాదశి వైష్ణవ ఆరాధనలకు ముఖ్యమైంది. దీనినే తొలి ఏకాదశి అని అంటారు. అప్పటి నుంచి ప్రతి వారం ఏదో ఒక పండుగ, వ్రతం, పూజలు నిర్వహిస్తారు. ఈ నెలలోనే గురు పూర్ణిమ, దేవశయన ఏకాదశి, వారాహి నవరాత్రి పూజలు ఈ మాసం తొలిరోజు నుంచే ప్రారంభమవుతాయి. తెలంగాణలో బోనాల ఉత్సవాలు, ఒడిశా రాష్ట్రం పూరీలో జగన్నాథుని రథయాత్ర వంటి ముఖ్యమైన కార్యక్రమాలు, ఉపవాస పండుగలు నిర్వహిస్తారు. చాతుర్మాసోత్సవాలు సైతం ఈ నెలలోనే ప్రారంభమౌతాయి. పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు విశ్రాంతి తీసుకుంటాడని, అందుకే ఈ కాలంలో శుభకార్యాలు చేయడాన్ని నిషేధించారని చెబుతారు. అయితే విష్ణుమూర్తిని పూజించడం, మంత్రాలను జపించడం శుభప్రదంగా పరిగణిస్తారు. దుర్గామాత ఆరాధన శక్తినిస్తుందని చెబుతారు. ఈ మాసంలో దుర్గాదేవిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దానధర్మాలకు ప్రాధాన్యం గల మాసమని, దానధర్మాలు చేయడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందంటారు. ఆషాఢ అమావాస్య రోజున పూర్వీకులను స్మరించుకుంటూ శ్రాద్ధ కర్మలు, తర్పణాలు నిర్వహించడం ద్వారా వారి అనుగ్రహం లభిస్తుందంటారు.



గోరింటాకుతో ఆరోగ్యం

గోరింటాకు ప్రత్యేకం

ఈ కాలంలో గ్రామీణులు గోరింటాకు పెట్టుకుంటారు. దీనితో సైన్స్ ముడిపడి ఉంది. వర్షాలు కురవడం వల్ల క్రిమికీటకాలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతాయి. చర్మవ్యాధుల నివారణకు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలు ఎక్కువగా గోరింటాకు అలంకరణగా భావిస్తారు. పెళ్లి ఈడుకొచ్చిన యువతులకు బాగా పండితే మంచి మొగుడు వస్తాడని అంటారు.

వధూవరులకు తప్పని విరహం

ముఖ్యంగా ఆషాఢమాసం అనగానే గుర్తుకువచ్చేది కొత్తగా పెళ్లైన దంపతులు కలవకూడదనే ఆచారం. ఇది పూర్వం నుంచీ వస్తోంది.



కొత్తపేట విజయకనకదుర్గాదేవి (ఫైల్)

దీనిలో భాగంగా అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళతారు. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయని పెద్దలు, పండితులు చెబుతారు. అత్త, మామలు దాటిన గుమ్మం అల్లుడు దాటకూడదని, అత్తా, కోడలు ఒక ఇంటిలో ఉండకూడదని రకరకాల కథనాలతో పాటు ఈ మాసం నుంచే వర్షాకాలం ప్రారంభమౌతుంది. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టి పనులు ప్రారంభిస్తారు. కొత్తగా పెళ్లైన యువకుడు వ్యవసాయ పనులకు డుమ్మా కొట్టి అత్తవారింట్లోనే గడుపుతాడు.. ఇక్కడ పనులు సాగవనే కారణంతో ఈ నెల రోజులు నూతన దంపతులు కలవకూడదనే నియమం పెట్టారంటారు.

9.30 లోపు హాజరు సరికాదు

అమలాపురం టౌన్: పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం 9.30 లోపు హాజరు వేయాలన్నది సరైన పద్ధతి కాదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు అన్నారు. ఈ మేరకు వారు అమలాపురంలో శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆ విధానంపై అభ్యంతరం తెలిపారు. కొందరు తల్లిదండ్రులు విద్యార్థులను వెంటబెట్టుకుని రకరకాల కారణాలతో ఆలస్యంగా వచ్చే సందర్భాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. కొన్ని పాఠశాలల్లో ఆర్టీసీ బస్సులపై ప్రయాణం చేసి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఒక్కోసారి ట్రాఫిక్ ఇతర సమస్యలతో ఆలస్యంగా వస్తారని తెలిపారు. విద్యార్థుల హాజరుతో పాటు భోజనం తినే వారి వివరాలు కూడా పంపవలసి ఉన్న దృష్ట్యా ఆలస్యంగా వచ్చే పిల్లల భోజనం విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని కారణాలతో విద్యార్థులకు ఆన్‌లైన్ హాజరుకు ఉదయం 10 గంటల వరకూ సమయం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు నిర్దేశించిన లీవ్ యాప్‌లో ఫేస్ అటెండెన్స్ వేసేటప్పుడు ఎల్‌ఈఏపీ యాప్ సామర్థ్యం సరిపోక తరుచూ సర్వర్ సమస్య తలెత్తుతోందని వారు పేర్కొన్నారు. విద్యాశాఖ ఈ సమస్యను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. సీఎల్ అప్లై చేసుకునే ఉపాధ్యాయులు ఉదయం 7 గంటల లోపే అప్లై చేసుకోవాలన్న ఆంక్షలు కూడా సరైనవి కావని వారు అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరిగా పాఠశాల సమయానికి ముందే సీఎల్ ఎప్పుడైనా అప్లై చేసుకునే అవకాశం ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణకుమార్, సురేష్‌బాబు స్పష్టం చేశారు.

వందనానికి వంకలా!

- అంగన్‌వాడీల పిల్లలకు అందని పథకం
- ప్రభుత్వోద్యోగులుగా భావిస్తే ఆ ప్రయోజనాలు తమకూ కల్పించాలని డిమాండ్
- యాప్‌ల యాతనతో పనిభారం పెంచారు
- 42 రోజుల సమ్మె హామీల విస్మరణ
- కూటమి ప్రభుత్వంపై ఆ వర్గం నిప్పులు


ఫిబ్రవరి 17న కపిలేశ్వరపురంలోని ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)


వెదురుమూడిలో అంగన్‌వాడీ చిన్నారుల సంసిద్ధత కార్యక్రమంలో.. (ఫైల్)

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే ప్రజలకు మేలు చేసేద య్యుండాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అమలు చేయాలి. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఐదేళ్ల అధికారం ఇస్తే అందులో సామాజిక పింఛన్లు తప్ప మిగిలినవేవీ అమలుకు నోచుకోలేదు. ప్రజల ఒత్తిడి నేపథ్యంలో తల్లికి వందనం ప్రారంభించినప్పటికీ అనేక మంది అర్హులు సాయం అందక గగ్గోలు పెడుతున్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వంటి వారిని విధానపరంగా సంక్షేమ పథకాలకు దూరం పెట్టడంతో చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు అన్యాయం చేయడానికి తామేం పాపం చేశామంటూ ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ పథకాలు చిరుద్యోగులమైన తమకు సైతం అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

సాంకేతికత పేరుతో పనిభారం

అనేక విభాగాల వారికి చేదోడువాదోడుగా ఉండే పనులకు వినియోగించుకోవాల్సిన అంగన్‌వాడీలపై సాంకేతికత పేరుతో కూటమి ప్రభుత్వం భారం మోపుతుంది. పోషకాహారాన్ని అందుకునే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఫేస్ యాప్‌లో నమోదు చేయాల్సి రావడం భారంగా ఉందని, యాప్ యాతనను తొలగించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్‌లను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా 6 నెలలు నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) అందిస్తున్నారు. ఆ రెండు యాప్‌లలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వాటితో పాటు అధికారులు మరో 12 రకాల రికార్డులు రాయిస్తున్నారు. ఏడు నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకుల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారుల ఆధార్ అప్‌డేట్ కాకపోయినా, ఈకేవైసీ కాకపోయినా, ఆధార్ కార్డులో లబ్ధిదారుని ఫోన్ నంబర్ అనుసంధానం కాకపోయినా వివరాలు యాప్‌లో నమోదు కావడంలేదు. అప్‌డేట్ వ్యవహారాలు సచివాలయానికి వెళ్లి సరిచేసుకోవాలని లబ్ధిదారులకు చెప్తున్నప్పటికీ వారు ఖాతరు చేయడంలేదు. దీంతో చేసేది లేక లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అంగన్‌వాడీలు పోషకాహారాన్ని అందించాల్సి వస్తోంది.

ఉద్యమాలపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా తాము అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని కూటమి నేతలు అప్పట్లో హామీ ఇచ్చారు. ఏడాది పాలనాకాలం గడిచినా హామీలో ప్రధానమైనదైన రూ.26 వేలకు జీతాలను పెంచాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టారు. ఒక్క రూపాయి కూడా వేతనాన్ని పెంచలేదు. అంగన్‌వాడీ కార్యకర్త చనిపోయినప్పుడు రూ. 20 వేలు మట్టి ఖర్చులు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో రూ.15 వేలు చెల్లించాలంటూ జీఓ జారీ చేశారు. రాష్ట్రంలోని 6,830 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలన్న డిమాండ్‌పైనా ఉలుకూ పలుకూ లేదు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. 2024 జూలై 10న కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వారు ర్యాలీలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10న ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఫిబ్రవరి 17న ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాని ఆందోళనలు చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మార్చి 11న నిర్వహించిన చలో విజయవాడ ఆందోళనలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున బయలుదేరారు. 10న సామర్లకోట, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లు, పలు బస్ స్టేషన్ల వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈనెల 23న ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించిన ధర్నాను నిలువరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర ప్రయత్నం చేసి విఫలమైంది.

ఉమ్మడిజిల్లాలో అంగన్‌వాడీలు ఇలా...

కాకినాడ జిల్లాలోని 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,986 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1,05,996 మంది ప్రీస్కూల్ పిల్లలు, 11,610 మంది బాలింతలు, 10,573 మంది గర్భిణులకు అంగన్‌వాడీలు విశేష సేవలందిస్తున్నారు.
- కోనసీమ జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలుండగా 86,296 మంది చిన్నారులు, 15,743 మంది గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నారు.
- తూర్పుగోదావరి జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,536 మెయిన్, 26 మినీ మొత్తం 1,562 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులు సేవలందుకుంటున్నారు.

సంక్షేమ పథకాలకు దూరం చేయొద్దు



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కనీస వేతనాలను చెల్లించకుండా అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీలను దూరం చేస్తోంది. అదే నిర్ణయాన్ని ప్రభుత్వం అమలు చేయదలిస్తే అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న ప్రతి సదుపాయాన్ని కల్పించడంతో పాటు వేతనాలను పెంచాలి. ఆందోళనలు చేస్తున్నప్పుడు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే సహించేది లేదు.

– జి.బేబీరాణి, రాష్ట్ర అధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, కాకినాడ

ఆర్టీసీ ఏటీఎమ్ కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా (కమర్షియల్) కిరణ్ కుమార్ శుక్రవారం రాజమహేంద్రవరంలో బాధ్యతలు చేపట్టారు. తుని డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు డీపీటీవో వైఎస్‌ఆర్ మూర్తి సారథ్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేసిన మాధవ్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. కాగా.. కిరణ్ కుమార్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని ఆర్టీసీ డిపోలలో పార్శిల్ కార్యాలయాలను పర్యవేక్షించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాలి వాసి మృతి

- కశింకోటలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముందున్న లారీని ఢీకొట్టి ఘటన
- వ్యాన్ డ్రైవర్‌తో సహా మహిళ దుర్మరణం
- మరో మహిళకు గాయాలు


సత్యనారాయణ (ఫైల్)

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జమాదులపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్తున్న కంటైనర్‌ను బొలేరో వ్యాన్ ఢీకొంది. దాంతో వ్యాన్ డ్రైవర్ సహా ఒక మహిళ దుర్మరణం పాలయ్యారు. మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన పూల వ్యాపారి కన్నూరు లక్ష్మి(40)తో పాటు మరో మహిళ తూర్పు గోదావరి జిల్లా కడియం వద్ద పూలు కొనుగోలు చేసి గాజువాకలో విక్రయానికి వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఈ వ్యాన్ అదే మార్గంలో ముందు వెళ్తూ అకస్మాత్తుగా ఆగిన కంటైనర్ లారీని బలంగా ఢీకొంది. దీంతో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పి.సత్యనారాయణ (25), పూల వ్యాపారి లక్ష్మి(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లి మండలం కోడూరుకు చెందిన పూల వ్యాపారి ఎస్.వరలక్ష్మి తీవ్రంగా గాయపడింది. వెంటనే సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ లక్ష్మణరావులతోపాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వరలక్ష్మిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహాపై విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.


కంటైనర్ లారీని ఢీకొన్న పూల లోడు వ్యాన్


వ్యాన్‌లో చిక్కుకున్న సత్యనారాయణ మృతదేహం

కేబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాలు..

ఈ ఘటనలో వ్యాన్ క్యాబిన్ నుజ్జవడంతో అందులో డ్రైవర్, పక్క సీటులో కూర్చున్న లక్ష్మి మృత్యువాత పడ్డారు. పోలీసులు అతి కష్టం మీద వారిని బయటకు తీసి అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

సింగరాజుపాలెం ప్రజల అభ్యంతరం


సింగరాజుపాలెంలో సెల్ టవర్ నిర్మాణం వద్దని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

దేవరపల్లి: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మించవద్దని నల్లజర్ల మండలం సింగరాజుపాలెం ప్రజలు అభ్యంతరం తెలిపారు. టవర్ నిర్మిస్తున్న స్థలం వద్ద పలువురు గ్రామస్తులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ నిర్మాణం వల్ల ప్రమాదాలతో పాటు అనారోగ్యాలకు గురవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ శివారున టవర్ నిర్మిస్తే ఇబ్బంది లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు నివశిస్తున్న కాలనీలో ఓ వ్యక్తికి చెందిన స్థలంలో గురువారం అర్ధరాత్రి టవర్ నిర్మాణానికి గోతులు తవ్వడం ప్రారంభించారని, ఈ విషయం తెలుసుకున్న పలువురు అక్కడకు చేరుకుని పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 2018లో ఇదే ప్రాంతంలో సెల్‌టవర్ నిర్మాణ పనులు చేపట్టగా అప్పటి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ అనుమతి లేకుండా మళ్లీ అర్ధరాత్రి పనులు చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయపాటి శేషు, గద్దే శ్రీనివాస్, వామిశెట్టి వెంకటేశ్వరరావు, అయినపర్తి చిన్న తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 2న జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జులై 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని సీఈవో కోరారు.

అధికార లాంఛనాలతో బ్లెస్సన్ అంత్యక్రియలు

ఆలమూరు: విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ జీవన్ (32)కు పోలీసు శాఖ అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. ఆలమూరులోని ఆయన నివాసం నుంచి ప్రజల అశ్రునయనాల మధ్య పోలీసు బందోబస్తుతో మృతదేహాన్ని ఆలమూరులోని ఏటిగట్టు పక్కన ఉన్న శ్మశాన వాటికకు తీసుకువచ్చారు. బ్లెస్సన్ అమర్ రహే అంటూ క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో భౌతిక కాయాన్ని ఖననం చేశారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, రావులపాలెం సీఐ కె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించి 12 రౌండ్లు గాలిలో పేల్చి గౌరవ వందనం చేశారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు గురువారం రాత్రి బ్లెస్సన్ నివాసానికి వచ్చి నివాళులు అర్పించారు. పోలీసుశాఖలో అంకితభావంతో పనిచేసే అత్యుత్తమ కానిస్టేబుల్‌ను కోల్పోయిందని ఆయన ఆవేదన చెందారు. బ్లెస్సన్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. క్రైమ్ సీఐ గజేంద్ర, ఆత్రేయపురం ఎస్సై టి.రాము, ట్రైనీ ఎస్సై బాలకృష్ణ, సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఆలమూరులో పోలీసుల గౌరవ వందనం మధ్య కానిస్టేబుల్ బ్లెస్సన్ అంత్యక్రియలు